వంజంగి కొండపై ఎగిరిన త్రివర్ణ పతాకం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సమీపంలో ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి కొండపై గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల జెండా రెపరేపలాడింది. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన సందర్శకులు మువ్వన్నెల జెండా రెపరెపలాడటం చూసి కేరింతలు కొట్టారు. స్థానిక యువత గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జెండాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పర్యాటకులు జెండాకు సెల్యూట్ చేశారు.

కొండపై ఎగురుతున్న జెండా

గిరిజనుల అభివృద్ధికి అంకితమవ్వాలి

- కలెక్టర్ సుమిత్ కుమార్
- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో గిరిజన సంక్షేమానికి అధికారులు, ఉద్యోగులు అంకితం అవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సిపిహెచ్ స్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా జాతీయ పతాకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తర్వాత గిరిజనుల కోసం మాత్రమే కొత్త జిల్లా ఏర్పడిందని, దీంతో, ప్రజల్లో ఆశలు, ఆకాంక్షలు పెరిగాయని తెలిపారు.అందుకు అనుగుణంగా మనమందరం కలిసి ప్రజల ఆర్థిక, సామాజిక సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని, ఆశించిన ఫలితాలు సాధించేందుకు అంకిత భావంతో పని చేయాలని సూచించారు.'జగన్న భూ హక్కు, భూ రక్షా కార్యక్రమం' కింద ప్రతి రైతుకు భూమిపై శాశ్వత హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.35 వేల భూ రెవెన్యూ మ్యుటేషన్లు, సర్వే రికార్డుల ప్రక్షాళన లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 294 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసామని, ఏడాది చివరి నాటికి వెయ్యి గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. వివిధ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణంతో పాటు ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్, జియో నెట్‌వర్క్‌ల సేవల కోసం 2,129 సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో వీటి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గంజాయి దాదాపుగా నిర్మూలించామని, యువత సంఘ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనకుండా అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా స్కిల్ హబ్, స్కిల్ కాలేజ్ ద్వారా అనేక ఉపాధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో నాడు-నేడు కింద 947 పాఠశాలలు, 127 అంగన్‌వాడీ కేంద్రాలు, 12 జూనియర్ కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 38 కోట్ల నిధులతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.58,456 మంది లబ్ధిదారులను గుర్తించి, అదనపు ఇళ్ల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామని, ఇప్పటికే మంజూరైన 17,118 ఇళ్లను ఈ ఏడాది పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అగ్రికల్చర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో భాగంగా రూ. 1.36 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసామని తెలిపారు. రైతులకు ఖరీఫ్‌లో రూ.374 కోట్లు, రబీలో రూ.206 కోట్లు పంట రుణాలు మంజూరు చేశామన్నారు. అనంతగిరి మండలం నుండి కొయ్యూరు మండలం వరకు, రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో రంపచోడవరం నుంచి కొయ్యూరు వరకు నాలుగు జాతీయ రహదారుల ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో 2024 నాటికి ఇంటింటి కుళాయి ద్వారా ప్రతి వ్యక్తికీ 55 లీటర్ల తాగునీరు అందించేందుకు రూ. 630 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. తాగునీటి అవసరాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం 1250 ప్రాజెక్టులను మంజూరు చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాడేరు శాసనసభ్యురాలు కె.భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ, ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు

స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల మైదానంలో కలెక్టర్ సుమిత్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.తలారి సింగి బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన స్కిట్ ఆకట్టుకుంది. తలారిసింగి బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రథమ, కేజీబీవీ విద్యార్థులు ద్వితీయ, తలారిసింగి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు.

శకటాల ప్రదర్శన

వ్యవసాయ శాఖ, ఉద్యానవన, ఆరోగ్యశాఖ, అమెరికన్ ఇండో ఫౌండేషన్, గిరిజన సహకార సంస్థ, పౌరసరఫరాలు, విద్యాశాఖ, డిఆర్‌డిఏ, వైయస్సార్ క్రాంతి పదం తదితర శకటాలను ప్రదర్శించారు.

ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు

ఆకట్టుకున్న ప్రకృతి వ్యవసాయం శకటం

జెండాకు వందనం చేస్తున్న పిఒ గోపాలకృష్ణ

వ్యవసాయ, ఉద్యానవన శాఖ గిరిజన సహకార సంస్థ, ఐసిడిఎస్, ప్రదర్శన స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఒక యూనిట్ రూ.75000 విలువైన ఐదు యూనిట్ లను 60 శాతం రాయితీపై అతిథులు చేతుల మీదగా పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,708 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.1,07,93,00ల బ్యాంకు లింకేజ్ కల్పించి చెక్కును అందజేశారు.

విగ్రహాల ఆవిష్కరణ

తలారిసింగి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పిఓ రోణంకి గోపాలకృష్ణ, శాసనసభ్యులు కె.భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు.

కలెక్టరేట్‌లో...

స్వాతంత్ర్య సమరంలో మేధావుల ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరూ కషి చేయాలని సంయుక్త కలక్టర్ జే.శివ శ్రీనివాసు కోరారు. కలెక్టరేట్‌లో జరిగిన గణతంత్ర వేడుకలలో జేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి వి.వి శర్మ, జిల్లా ఖజానాదికారి ప్రసాద్ బాబు, తహసిల్దార్లు చిన్ని కృష్ణ, బివి రామారావు, డిపిఆర్‌ఓ గోవింద రాజులు పాల్గొన్నారు.

ఐటిడిఎలో..

పాడేరుటౌన్: గణతంత్ర దినోత్సవాన్ని పాడేరు ఐటిడిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఐటిడిఎ కార్యాలయం ప్రాంగణంలో ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలక్రిష్ణ జాతీయ జెండాను ఆవిష్కరిచారు. పోలీస్‌ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాంమల్లుదొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒలు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఇఇ డివిఆర్ఎం రాజు, ఎఒ హేమలత, ఎఎఒ శ్రీనివాసకుమార్, ఐటిడిఎ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన

మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లి రెడ్డి

ప్రజాశక్తి- మారేడుమిల్లి : 1/70చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గిరిజన చట్టాల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని నినదిస్తూ రంపచోడవరం మండల గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనసంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు చెందిన సురెడ్డి రమణరెడ్డి అనే గిరిజనేతరుడు 1/70 చట్టాలన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఏళ్ల తరబడి చేసిన ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న అనేక చట్టాల్లో ముఖ్యమైన 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గిరిజనుల పోరాట స్ఫూర్తి తెలియని వారు భూమి, ఉద్యోగం, ఖనిజ సంపదను దోచుకోవడం కోసం 1/70 చట్టాలను రద్దు చేయాలని చూస్తున్నారని, గిరిజనుల మనుగడకు ముప్పు వాటిల్లే ఇటువంటి చర్యలను అందరూ ప్రతిఘటించాలని గిరిజన చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎస్. విద్యాసాగర్‌రెడ్డి, గిరిజన మండల కార్యదర్శి టి.శ్రీను, సిఐటియు జిల్లా నాయకురాలు ఎం. రామలక్ష్మి, కె. చెల్లాయమ్మ, మండల కార్యదర్శి కె. రామకృష్ణరెడ్డి, ఎ.రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిటిసి అప్పారావు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని గదబపాలెం పంచాయతీ కేంద్రంలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. గ్రామంలో 2021-22సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల అమలుపై స్థానిక సర్పంచ్ ఉల్లి నర్సమ్మ, డౌనూరు ఎంపిటిసి బిడిజన అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నన్న సామాజిక తనిఖీల్లో మల్లవరం, కొత్తూరు, గదబపాలెం ఊర్ల తదితర చుట్టుపక్కల గ్రామస్తులు వచ్చి పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ నీలపు సురిబాబు, ఉల్లి రాంమూర్తి, చిరంజీవి, మూల పేట విఆర్వీ సింహాచలం గారు, వెంకటేశ్వర్లు, గోవింద్ మాజీ ప్రెసిడెంట్ రాంబాబు,నేగుల లక్ష్మణరావు పాల్గొన్నారు.

పూల దండలు ధరించి నిరసన చేపడుతున్న గిరిజనులు

భూములకు రక్షణ కల్పించాలని..

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: తమ సాగు భూములు 110. ఎకరాలను గిరిజనేతరులు కబ్జాకు పాల్పడ్డారని, వాటిని రక్షించాలని గిరిజనులు శరీరంలో పూలదండలు పెట్టుకొని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూలు రొంపల్లి పంచాయతీ పరిధి బూరుగా, చిన్నకోనెల గ్రామాలకు చెందిన 52 కుటుంబాల గిరిజనులు గురువారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి గిరిజన నేతరుల ఆధీనంలో ఉన్న భూములను తక్షణమే తమకు అప్పగించాలని, కబ్జాకు పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమీల అప్పలరాజు, కొనపర్తి సింహాచలం మాట్లాడుతూ, తాత ముత్తాతల కాలం నుండి నేటి వరకు చిన్న కోనల రెవెన్యూ పరిధిలో సుమారు 110 ఎకరాల భూమిని బూరిగ చిన్నకోనెల గ్రామాలకు చెందిన 52 కుటుంబాలు పూర్వకాలం నుండి సాగు చేస్తూ జీవనాధారం కొనసాగిస్తున్నామని తెలిపారు.కొంతమంది మైదాన ప్రాంతాలకు చెందిన భూస్వాములు విశాలమైన సాగు భూములపై కన్నువేసి కబ్జాకు పాల్పడ్డారని తెలపారు. వెబ్ ల్యాండ్, అడంగల్‌లో తమ పేర్లను తొలగించి భూ స్వాముల పేర్లు నమోదైన విషయాన్ని తెలుసుకున్న అనంతరం 2020 సంవత్సరంలో తమకు అన్యాయం జరిగిందని అల్లూరి సీతారామరాజు జిల్లా సబ్ కలెక్టర్‌ని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వం నుండి ఎటువంటి న్యాయం జరగలేదని, దీంతో ఆందోళన కార్యక్రమం చేపట్టామని తెలిపారు.ఇప్పటికైనా తమ గ్రామంలో కలెక్టర్ సందర్శించి తమ భూములు తమకి అప్పగించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ఫిబ్రవరిలో నిరాహార దీక్ష చేపట్టేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు భూరిగ పెంటయ్య,. రామారావు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం పాట

- ఎక్సైజ్ సిఐ గణపతిబాబు

ప్రజాశక్తి -అరకులోయరూరల్: అరకులోయ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలో గంజాయి, నాటుసారా వివిధ ఎక్సైజ్ కేసులో పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 28న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు అరకులోయ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ.గణపతిబాబు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పట్టుబడ్డ వాటిలో ఆటోలు-1, మోటార్ సైకిళ్ళు 4 మొత్తం 5 వాహనాలకు వేలం పాట వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు ఫోన్ నంబర్లు: 9440902393, 8500455420, 981049077లకు సంప్రదించాలని కోరారు.

ఉత్తమ సేవలకు గణతంత్ర పురస్కారాలు

కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డిఎల్ పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలుర పాఠశాల ప్రాంగణంలో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిపి 269 మందికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, జిల్లా ఎస్పి సతీష్ కుమార్ ప్రశంసా పత్రాలు అందించారు. డిఎల్‌పిఒ పిఎస్ కుమార్, టిడబ్ల్యూ డిడి కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, టిడబ్ల్యూ ఇంజనీరింగ్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బిఆర్.మోహన్‌రావు తదితరులు ఉత్తమ సేవ ప్రశంస పత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు. తమ సేవలను గుర్తించి ఇలా ప్రశంస పత్రాలు అందజేయడం సంతోషంగా ఉందని మరింత సేవలందిస్తామని వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులకు, ఉద్యోగులకు పలువురు అభినందించారు.

ముంచింగిపుట్టు: పశు వైద్యాధికారి కె.భాస్కర్‌రావు విశిష్ట సేవలకు గాను గణతంత్ర వేడుకల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఎమ్మెల్యే కే.భాగ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు. పశు వైద్యాధికారి భాస్కర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తాను చేసిన సేవలకు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రశంస పత్రం అందజేయడం సంతోషకరమని ఆయన అన్నారు.

హుకుంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీడీవోల చేతుల మీదుగా ప్రశంస పత్రాలను పలువురు అందుకున్నారు.మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ జి.పార్వతి, మండల విద్యా శాఖ కోఆర్డినేటర్ వి.జయరాజు, కంప్యూటర్ ఆపరేటర్ పి.జాన్ బాబు, సిఆర్‌సిలు, బి గంగరాజు, బి.వసంత కుమారి, అటెండర్ డి.సుమిత్ర, బోర్ మెకానిక్‌లు బి.రామరాజు, బి.నాగేశ్వరావు, తదితరులు మండల కేంద్రంలో ప్రశంస పత్రాలు అందుకున్నారు. తహసిల్దార్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అరకులోయరూరల్: అరకులోయ సిఐ జి దేముడుబాబుకు, హెడ్ కానిస్టేబుల్ పురంధర్‌కు పాడేరులో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ సతీష్ కుమార్ నుంచి ప్రశంస పత్రాన్ని అందజేశారు.

కొయ్యూరు : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన కొయ్యూరు గ్రామీణ వికాసబ్యాంకు మేనేజర్ జి.సతీష్‌కుమార్, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రిపబ్లిక్ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కరాలు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు వారిని అభినందించారు.

అడ్డతీగల: అడ్డతీగల ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న నల్లా వివేక్ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతులమీదుగా గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవ పురస్కారం ప్రశంసా పత్రం అందుకున్నారు. అలాగే అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో కోర్ట్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్. సూర్యతేజ కూడా గణతంత్ర పురస్కారాన్ని అందుకున్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీదుర్గ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని డాక్టర్ శ్రీదుర్గకు అందజేశారు. డాక్టర్ శ్రీదుర్గను పిహెచ్‌సి సిబ్బంది, నేతలు, అధికార్లు అభినందించారు.

పురస్కారం అందుకుంటున్న అరకు సిఐ

అవార్డు అందుకుంటున్న కొయ్యూరు బ్యాంకు మేనేజర్

హుకుంపేటలో అవార్డు అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

పురస్కారం స్వీకరిస్తున్న రాజవొమ్మంగి డాక్టర్ శ్రీదుర్గ

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రత్యేక వైద్యసేవలు

చింతూరు, కూనవరంలో వైద్యనిపుణుల నియామకం

అందుబాటులో అన్ని రకాల ఆపరేషన్లు, మెరుగైన సేవలు

చింతూరు ఏరియా ఆసుపత్రిలో సిజేరియన్ ఆపరేషన్

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు ఏరియా ఆసుపత్రిలో గురువారం నుంచి సిజేరియన్ ఆపరేషన్లు ప్రారంభమైనట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవి కోటిరెడ్డి తెలిపారు. విలీన మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే ధనలక్ష్మి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్ వీలీన మండలాలైన చింతూరు కూనవరం ప్రభుత్వ ఆసుపత్రులకు స్పెషలిస్ట్ వైద్యులను నియమించారన్నారు. చింతూరు ఆసుపత్రికి గైనకాలజిస్టు, ఇఎన్‌టి, ఆర్థోపెడిక్ సర్జన్ వైద్యనిపుణులు నియామకం కాగా, కూనవరం ఆసుపత్రికి జనరల్ సర్జన్ వచ్చినట్లు తెలిపారు. గురువారం చింతూరుకు చెందిన షేక్ ఫర్హాన్ అనే గర్భిణికి గైనకాలజిస్టు డాక్టర్ శశికళ దేవి, సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో మొట్టమొదటి సిజేరియన్ ఆపరేషన్‌ను నిర్వహించారు. కూనవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకటి రెండు రోజుల్లో జనరల్ సర్జరీలు నిర్వహిస్తామన్నారు. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గైనిక్ సేవలతో పాటు ఆర్థోపెడిక్, ఇఎన్‌టి స్పెషలిస్ట్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని, విలీన మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. త్వరలో ఈ రెండు ఆసుపత్రుల్లో మరికొంతమంది స్పెషలిస్ట్ డాక్టర్లు వస్తారని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌కు ఘన సత్కారం

గంగాధర్‌ను సత్కరిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి -చింతూరు : చింతూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంలోని వెయిట్ లిఫ్టింగ్ కోచ్ గంగా ధర్‌ను చింతూరు ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మంత్రి సత్య నారాయణ, ప్రేమ్ నాథ్ గురువారం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ తర్వాత కోచ్ గంగాధర్‌కు ఘన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, చింతూరు డివిజన్ కేంద్రంతోపాటు ఏజెన్సీలోని పలువురు గిరిజన యువతకు వెయిట్ లిఫ్టింగ్‌లో తర్ఫీదునిచ్చి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేస్తున గంగాధర్ కృషిని కొనియాడారు. అనంతరం తహశీల్దార్ సాయికృష్ణను కలిసి, ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. కోశాధికారి జీవన్ కుమార్ శివకుమార్. మరియు స్థానిక నేతలు రామారావు చౌదరి, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు మడివి రాజు పాల్గొన్నారు.

వాడవాడలా గణతంత్ర వేడుకలు

అరకులోయలో....

ప్రజాశక్తి-యంత్రాంగం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాలను ఎగురవేశారు.

అరకులోయరూరల్:మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయతి డంపింగ్ యార్డ్ వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలు పెదలబుడు పాలకమండలి సభ్యులు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈవోపీఆర్డి పాలక రాజ్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేసి ప్రజల పురోభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. ఎంపీపీ రంజిపల్లి ఉషారాణి, ఎంపిటిసి -2 దురియా ఆనంద్, ఎంపిటిసి-3 శత్రుఘ్న, బల్లుగూడ ఎంపీటీసీ రామ్మూర్తి, మాదల ఎంపిటిసి రామచందర్, వార్డ్ మెంబర్లు శైలజ, లక్ష్మణ్ నాగరాజు పాల్గొన్నారు.

అనంతగిరి:తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహశీల్దార్ లంక పాత్రుడు, సచివాలయం, పాఠశాలలో జడ్పిటిసి. గంగరాజు, మండల పరిషత్ కాలనీ వద్ద ఎంపీడీవో, శివలింగపురం పాఠశాలలో ఎమ్మెల్యే శెట్టి. పాల్గుణలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీడీవో ఆర్.వి.ఎస్ రమేష్, తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ నర్సమ్మ, పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ కె.రవీంద్రలు జెండాలను ఎగురవేశారు. శారద ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్ లో చిన్నారులతో పలు పోరాటయోధుల వేషధారణ ఆకట్టుకుంది.

దుంబ్రిగూడ:ఎంపీడీవో నగేష్, తహసిల్దార్ షేక్ ముజీబ్, ఎస్సై సంతోష్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కంద్రూం పంచాయతీ సచివాలయం వద్ద సర్పంచ్ హరి, పోతంగి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి జెండాను ఆవిష్కరించారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం : ఎస్టి కమిషన్ చైర్మన్

దుంబ్రిగూడ: ఆదివాసులకు దళారీ వ్యవస్థ నుంచి ఎటువంటి అన్యాయం జరిగినా రాష్ట్ర ఎస్టి కమిషన్ అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు భరోసానిచ్చారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థినుల నృత్యాలు ఆకర్షించాయి. ఆయన మాట్లాడుతూ, ఆదివాసి బిడ్డల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. మూడున్నర ఏళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల ఇరవై ఆరువేల ఎకరాలకు సంబంధించి పోడుపట్టాలను వైసిపి ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేసిందన్నారు. సంపూర్ణంగా అక్షరాస్యత సాధించాలని ఆయన చెప్పారు విదేశాలకు వెళ్లి చదువుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల నుంచి కోటి వరకు ఖర్చు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టి కమిషన్ సభ్యులు రామలక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు, మండల విద్యాశాఖ అధికారి త్రినాధరావు, ఏటీడబ్ల్యూఓ మల్లికార్జున్, ప్రధానోపాధ్యాయులు సునీత, బాలాజీ, అర్జున్, తహసిల్దార్ షేక్ ముజీబ్, ఎంపీడీవో నగేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవిబాబు

సీలేరు: సీలేరు పోలీస్‌స్టేషన్లో సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. చిన్నారులకు స్వీట్లు, విద్యార్థులకు నోటుబుక్కులు పెన్నులు పంపిణీ చేశారు. ఎపి జెన్‌కో కార్యాలయంలో ఎస్ఇ(సివిల్) ప్రశాంత్ కుమార్, జల విద్యుత్ కేంద్రంలో ఇఇ జాకీర్‌హుస్సేన్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, ఇంజనీర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు గౌరవ వందనం స్వీకరించారు. ఎపి గురుకుల పాఠశాల, గిరిజన బాలికల ఆశ్రమం పాఠశాల, జిల్లా పరిషత్, జూనియర్ కాలేజీ, డిఎవి పాఠశాల, ఎంపిపి పాఠశాలలు, ప్రయివేటు పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ వినోద్‌బాబు గురుకుల ప్రిన్సిపాల్ వెంకటరమణ, హెచ్ఎం రామన్న, రామచంద్రరావు పాల్గొన్నారు.

అనంతగిరిలో...

గాంధీ విగ్రహం ఆవిష్కరణ

గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జాతిపిత గాంధీ మహాత్ముని విగ్రహాన్ని జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్లో ఎపిజెన్‌కో ఎస్ఇ ప్రశాంత్‌కుమార్, ఇఇ జాకీర్‌హుస్సేన్, సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ కమాండెంట్ సురేష్, ఎస్ఐ రామకృష్ణ ఆవిష్కరించారు. గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విగ్రహదాత అల్లూరి సీతారామరాజు సొసైటీ నాయకులు మండి డొంగురు, ఏర్పాటుకు కృషి చేసిన స్థానిక ఎంపిటిసి పిల్ల సాంబమూర్తిని అభినందించారు ఎడిఇ అప్పలనాయుడు, ఎఇ సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎవి పాఠశాల విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ అలరించింది. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బాలాజీ లాడ్జి యజమాని నక్క జ్ఞానేశ్వరరావు ఆర్థికసాయంతో బహుమతులు అందించారు.వాలీబాల్ పోటీల్లో విజేతలకొండ మెమోరియల్ జట్టు, రన్నరప్ బచ్చులూరు జట్టుకు నగదు బహుమతులిచ్చారు. జెన్‌కో ఎడిఇ చంద్రశేఖర్, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ఆదివాసీ నాయకులు కోడా ఆనంద్, హెచ్ఎం దేవమణి, రామచంద్రరావు, సత్తిబాబు, జాన్‌బాబు, సర్పంచ్ వల్లిప్రసాద్ పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో...

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ పతాకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్న మాణిక్యం ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి,నివాళులు అర్పించి జెండా ఎగురవేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులిచ్చారు. కార్యక్రమంలో ఎస్. అప్పన్నమ్మ, వై. పద్మ, జి.హారతి, కె. శకుంతల, వి.డి. రవికుమార్, క. శైలజ, సిహెచ్. రాజబాబు, కె. శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, ఎన్.రమేష్,ఆర్. మౌనిక, పి. ఏడుకొండలు, పి. గౌతమి, జి.సాయికుమార్, వై. ఇమ్మానుయేలు, పి. అలివేలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సుబ్రమణ్య ఆచారి, మండల పరిషత్ వద్ద ఎంపిడిఒ బాపన్నదొర, విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఇఒ కె.తాతబ్బాయి, జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం పి శ్రీనివాసరావు, ఎపిఆర్ పాఠశాలలో ప్రిన్సిపల్ సత్యవేణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్‌పిటిసి ఒడగుల జ్యోతి పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన సచివాలయ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులిచ్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపిటిసిలు కె గంగదుర్గ, చుంద్రు లోవ లక్ష్మీ, వైసిపి నేతలు దాట్ల వెంకటేష్‌రాజు, చప్ప ప్రసాద్, కుశరాజు, కనిగిరి వీరబాబు, పాల్గొన్నారు.

కొయ్యూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. డౌనూరు పంచాయతీలో సర్పంచ్ పొట్టిక భవాని, ఎంపిటిసి బిడిజన అప్పారావు, బూత్ కన్వీనర్ పొట్టిక పోతురాజు, మార్కెట్ చైర్మన్ డైరెక్టర్ కూడా లక్ష్మి, సచివాలయ కన్వీనర్ లెగుల లక్ష్మి లెగుల ప్రసాద్ పాల్గొన్నారు. .

మోతుగూడెం : చింతూరు మండలం మోతగూడెం పంచాయతీలోపాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, ఎపి జెన్‌కో కార్యాలయాల్లో జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. డిఎవి పాఠశాలలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు

మారేడుమిల్లి : మారేడుమిల్లిలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్య సంస్థలు, పోలీస్ స్టేషన్, పలు పార్టీ కార్యాలయాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.మండల పరిషత్ కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలోల ఎంపిడిఒ వీరకిషోర్, ఎంపిపి సార్ల లలిత కుమారి, జెడ్‌పిటిసి బాలాజీబాబు సర్పంచ్ కొండాజాకబ్, వైస్ ఎంపిపి లక్కొండ రవికుమార్,ఉప సర్పంచ్ వీరబాబు,కార్యాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విఆర్ పురం : రేఖపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎఒ రత్నకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తహశీల్దార్ కార్యాలయం, మండల విద్యాశాఖ, వెలుగు, సచివాలయంలో జాతీయ పతకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ ఎంపిటిసి బంధం విజయలక్ష్మి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఎపిఎం సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ పంకు సత్తిబాబు సీనియర్ నాయకులు బంకు శ్రీరామ్మూర్తి హజరత్ ప్రకాశరావు, ఈర్ల నాగేశ్వరరావు, టిడిపి నేతలు మాజీ జెడ్‌పిటిసి రామారావు, రహీం వైసిపి నేతలు చిక్కాల బాలు, మామిడి రమణ, శ్రీను, విద్యార్థులు ఎంపీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

సీలేరులో....

రాజవొమ్మంగిలో...

విఆర్.పురంలో....

రాజ్యాంగ పీఠిక చదువుతూ అందరితో ప్రతిజ్ఞ చేయిస్తున్న రమాప్రభ

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించేవిగా ఉన్నాయని, వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పిలుపునిచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలు గురువారానికి 665వ రోజుకు చేరాయి. దీక్షల్లో శ్రామిక మహిళలు కూర్చున్నారు. తొలుత గణతంత్ర దినోత్సవం సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి దీక్షా శిబిరాన్ని రమాప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో, ఉపాధి కల్పనలో స్టీల్‌ప్లాంట్ ఎంతో కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ కర్మాగారం అనేక మంది త్యాగాలతో ఏర్పడిందని గుర్తు చేశారు. ఉద్యమం ద్వారా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేట్‌పరం చేస్తామని సరిగ్గా రెండేళ్ల క్రితం మోడీ ప్రభుత్వం ప్రకటన చేసిందన్నారు. అప్పటి నుంచి పలుమార్లు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి తీరుతామని బరితెగించి ప్రకటనలు చేస్తుంటే, విశాఖపట్నంలోని బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ ఏమాత్రమూ నోరు మెదపడం లేదని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజల ఆస్తులను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధంగా విధానాలు అవలంబించిందన్నారు. ఎక్కడా ఒక్క పరిశ్రమను కూడా నెలకొల్పలేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమాన్ని కులం, మతం ప్రాతిపదికగా బలహీనపరచడానికి కుట్రలు పన్నినా, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ప్రభుత్వ రంగం వల్లే దేశాభివృద్ధి జరిగిందని తెలిపారు. ప్రభుత్వ సంస్థల వల్ల విశాఖపట్నంలో శ్రామిక మహిళల సంఖ్య, స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య పెరిగిందన్నారు. అటువంటి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ కుమార్ మంగళం, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కో - కన్వీనర్ పి.మణి, నాయకులు పద్మ, మేరీ, మంగశ్రీ, రత్నం పాల్గొన్నారు.

ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 1973 నేవల్ బాయ్స్ ఎంట్రీ బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు గురువారం ఐఎన్ఎస్ సర్కార్‌లో ఘనంగా జరిగాయి. అక్కడే జరిగిన గణతంత్ర వేడుకలను వారు వీక్షించారు. తూర్పు నౌకాదళ వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్‌గుప్తాను కలిశారు విజయనగరం మహారాజా హైస్కూల్‌లో 1982-83లో పదో తరగతి చదివిన గొర్తి వాసుదేవరావు, గ్రంధి నాగేశ్వరరావు, వుల్లి కృష్ణమూర్తి తదితరులు గురువారం ఒకేచోట కలుసుకున్నారు. ఎంఆర్ కళాశాల వీరి అపూర్వ కలయికకు వేదికైంది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావుతో పాటు ఆ పాఠశాలలో అప్పటి ఉపాధ్యాయులుగా ఉన్న పది మందిని సన్మానించారు. నాటి విద్యార్థుల్లో ఎక్కువ మంది విశాఖలో స్థిరపడినట్టు నిర్వాహకులు తెలిపారు.

హెటిరో పైపులైన్‌కు..

అడ్డదారిలో అనుమతులు

ట్రిబ్యునల్‌ను లెక్కచేయని వైనం
ఎన్‌జిటిని ఆశ్రయించనున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జిటి)లో కేసు విచారణలో ఉండగా నక్కపల్లి వద్దగల హెటిరో డ్రగ్స్ కంపెనీకి రెండో పైపులైన్ అనుమతులు ఎలా వచ్చాయి ? పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఎన్‌జిటి నియమించిన జాయింట్ కమిటీ నివేదిక ఇవ్వడంతో పాటు పర్యావరణ నష్టానికి రూ.6.94 కోట్లు విధించాలన్న కమిటీ సిఫార్సులను అనుమతులు ఇవ్వడానికి ముందు ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు ? హెటిరో డ్రగ్స్ కంపెనీపై ఎన్‌జిటిలో కేసు వుందని తెలిసినా ఎపి కాలుష్య నియంత్రణ మండలి(ఎపిపిసిబి), ఎపి తీరప్రాంత నిర్వహణ సాధికారి సంస్థ (ఎపిసిజెడ్ఎంఎ) ఎందుకు మౌనందాల్చాయి ? కేసు నడుస్తుందని ఎపిపిసిబి, ఎపిసిజెడ్ఎంఎ చెప్పినా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పైప్‌లైన్‌కు అనుమతులిచ్చిందా ? తమకున్న రాజకీయ పలుకుబడితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను తప్పుదోవ పట్టించి అనుమతులు తెచ్చుకుందా ?.. ఇలా అనేక ప్రశ్నలు మత్స్యకారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ ఉల్లంఘనలకు హెటిరో కంపెనీ పాల్పడినట్లు ఎన్‌జిటి నియమించిన జాయింట్ కమిటీ నివేదిక సమర్పించిన దానిపై కేసు నడుస్తుండగా కొత్తగా అనుమతులు ఇవ్వడానికి లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఎన్‌జిటిలోవున్న కేసు అంశాలు, దానిపూర్వపరాలు ఇఎసి దృష్టికి తీసుకెళ్లలేదని తెలుస్తోంది. వాస్తవాలు దాచిపెట్టి, ఇఎసిని తప్పుదోవ పట్టించి పైప్‌లైన్ అనుమతులు తెప్పించుకుందన్న బలమైన ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎన్‌జిటిని ఆశ్రయించడానికి సమాయత్తమవుతున్నారు.

హెటిరో కంపెనీ (ఫైల్ ఫొటో)

కంపెనీ రసాయన వ్యర్థ జలాలు సముద్రంలోకి విడిచిపెట్టడంతో చేపల వేటలేక జీవనోపాధి పోయిందని, రెండో పైపులైన్‌కు అనుమతులు ఇవ్వొద్దని 2021 డిసెంబరు ఒకటి నుంచి నక్కపల్లి మండలం రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, అమలాపురం, డిఎల్‌పురం, బంగారయ్యపేట మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తూనే, మరోవైపు ఎన్‌జిటిలో కేసు వేశారు. ఈ కేసు విచారణలో వుండగా రెండో పైప్‌లైన్‌కు అనుమతులు రావడాన్ని సవాల్ చేస్తూ ఎన్‌జిటిని ఆశ్రయించనున్నారు. అనుమతులు ఇచ్చిన నెల రోజుల్లో ఎన్‌జిటికి ఫిర్యాదుచేసే అవకాశముండడంతో మత్స్యకారులు ఎన్‌జిటి దృష్టికి తమకు జరిగిన అన్యాయాన్ని తీసుకెళ్లడానికి సిద్ధపడుతున్నారు. పైప్‌లైన్ అనుమతుల కోసం హెటిరో కంపెనీ తప్పుడు సమాచారం ఇచ్చినట్లు రుజువైతే రెండో పైప్‌లైన్ అనుమతులను రద్దు చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం చర్యలు తీసుకోవడానికి అవకాశముందని ఓ న్యాయ నిపుణుడు చెప్పారు.

వ్యర్థాల విడుదల పరిమాణం పెంచి రెండో పైప్‌లైన్ అనుమతులు అమల్లోకి వస్తే మత్స్యకారులకు మరింత నష్టం జరగనుంది. చేపల వేటపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకారులకు సముద్రపు ఒడ్డుకు సమీప దూరంలో చేపలు దొరికే అవకాశం తక్కువని నిపుణులు చెబుతున్నారు. 4,522.44 మీటర్ల పొడవున హెటిరో రెండో పైప్‌లైన్ ఏర్పాటు చేయనుంది. దీంట్లో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) పరిధిలో 3,244.85 మీటర్లు, సాధారణ ప్రాంతంలో 1277.59 మీటర్లలో పైప్‌లైన్ వేయనుంది. అందులో భాగంగా సిఆర్‌జెడ్ -4 ఎ కింద సముద్రపు మామూలు అలల నుంచి సముద్రపు లోపలకు 1930.64 మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేయడం వల్ల మత్స్య సంపద నాశనమవుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పైపులైన్ అనుమతులు రద్దు చేయాలి

హెటిరో డ్రగ్స్ కంపెనీకి ఇచ్చిన రెండో పైప్‌లైన్ అనుమతులు వెంటనే రద్దు చేయాలి. మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటున్నందున రెండో పైప్‌లైన్ వేయొద్దని 419 రోజులుగా ఆందోళన జరుగుతోంది. ఎన్‌జిటిలో కేసు వుండగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతులు ఇవ్వడం న్యాయం కాదు. పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించి, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి. పోరాటాలతో రెండో పైప్‌లైన్‌ను అడ్డుకుంటాం.

ఎం.అప్పలరాజు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

ఎన్‌జిటికి వెళతాం

హెటిరో డ్రగ్స్‌కు రెండో పైప్‌లైన్‌కు అనుమతులు ఇవ్వడం అన్యాయం. ఆందోళన కొనసాగిస్తాం. ప్రభుత్వ నిర్ణయాలు నిరంకుశంగా ఉన్నాయి. హెటిరోపై ఎన్‌జిటిలో కేసు వుండగా పైప్‌లైన్‌కు అనుమతులు ఇవ్వడం సరికాదు. జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేస్తాం.

వాసుపల్లి నూకరాజు, మత్స్యకార నాయకుడు

విఆర్‌ఒను సత్కరిస్తున్న వైస్ ఎంపిపి పెంటయ్య

విఆర్‌ఒకు ఘన సత్కారం

ప్రజాశక్తి- కూనవరం : బదిలీపై వెళుతున్న మండలంలోని కూటూరు పంచాయతీ విఆర్‌ఒ జి.అప్పారావును గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలుసభలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ కోవిడ్, వరదల సమయంలో విఆర్‌ఒ అప్పారావు బాధితులకు విశేష సేవలు అందించారన్నారు. పంచాయతీ పరిధిలోని కొండరెడ్ల గ్రామాలకు సైతం వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు. ఐదేళ్లపాటు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి విఆర్‌ఒ అప్పారావు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఉద్యోగిగా ఆయనకు బదిలీ సహజమని,కొత్తగా బాధ్యతలు చేపట్టిన చోట ప్రజలు మన్ననలు పొందేలా సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సెక్రటరీ శ్రీనివాసరావు, విఆర్‌ఒ బ్రహ్మయ్య,పాయం సీతారామయ్య, విజయభాస్కర రెడ్డి, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ పాల్గొన్నారు.

నాగరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్ కల్యాణ్

జనసేనలో చేరిన కందుల నాగరాజు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు గురువారం జనసేన పార్టీలో చేరారు. ఇక్కడ నుంచి విజయవాడ వెళ్లి అక్కడ జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. 2021 మార్చి రెండో వారంలో జరిగిన జివిఎంసి ఎన్నికల్లో 32వ వార్డు నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు నాగరాజు టికెట్ ఆశించగా దక్కలేదు. దీంతో ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేసి అప్పటి వైసిపి అభ్యర్థి మూలే రామిరెడ్డిపై 1136 ఓట్ల తేడాతో విజయం సాధించారు. నాగరాజుకు 3526 ఓట్లు లభించగా, వైసిపికి 2390 ఓట్లు, టిడిపి అభ్యర్థి పంపాన రాజ్యలక్ష్మికి 1171 ఓట్లు, జనసేన అభ్యర్థి తెలుగు అర్జున్‌కు 331 ఓట్లు లభించాయి. ఎన్నికల అనంతరం నాగరాజు వైసిపిలో చేరారు. ఇప్పుడు ఆయన జనసేన టికెట్‌పై దక్షిణ నియోజవర్గం నుంచి శాసనసభకు పోటీ చేయాలని భావిస్తున్నారు. అయితే ఇదే నియోజకవర్గం నుంచి మత్స్యకార సామాజిక తరగతికి చెందిన డాక్టర్ మూగి శ్రీనివాసరావు జనసేన పార్టీ తరపున పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పుడు జనసేన టిక్కెట్ ఎవరికి దక్కుతుంది అనేది తెలియాల్సి ఉంది. 2019 ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా మత్స్యకార సామాజిక తరగతికి చెందిన గంపల గిరిధర్ పోటీ చేశారు. అప్పట్లో ఆయనకు సుమారు 18 వేలకుపైగా ఓట్లు లభించాయి. ఆ తర్వాత ఆయన జనసేన పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నియోజకవర్గ నుంచి 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ గెలుపొందిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రావడంతో ఆయన వైసిపిలో చేరారు.